


బృందావని - ఝంప

క్షీరాబ్ధి కన్యకకు - శ్రీమహాలక్ష్మికిని
నీరజాలయకును - నీరాజనం

జలజాక్షి మోమునకు - జక్కవకుచంబులకు
నెలకొన్న కప్పురపు - నీరాజనం
అలివేణి తురుమునకు - హస్తకమలమ్ములకు
నిలుపు మాణిక్యముల - నీరాజనం

చరణకిసలయములకు - సకియరంభోరులకు
నిరతమగు ముత్యాల - నీరాజనం
అరిదిజఘనంబునకు - నతివ నతనాభికిని
నిరతి నానావర్ణ - నీరాజనం

పగటు శ్రీవేంకటేశు - పట్టపురాణియై
నెగడు సతికళలకును - నీరాజనం
జగతి నలమేల్మంగ - చక్కదనములకెల్ల
నిగుడు నిజశోభనపు - నీరాజనం

శ్రీమహాలక్ష్మి 'ఈం' కారవాచ్య 'తాం పద్మినీం
ఈం శరణమహంప్రపద్యే' అని శ్రీసూక్త మంత్రం. ఈ 'నీరా
జనం' అన్న పదంలో 'ఈ' కారమూ పూర్ణానుస్వారమూ
పొదగబడ్డాయి. 'శ్రీం' లక్ష్మీబీజాక్షరం.

ఏ కారణంవల్లనో షోడశోపచారాల సంకీర్తనలో చేర్చక, కర్పూర నీరాజనాన్ని అలమేల్మంగకు ప్రత్యేకించారు అన్నమాచార్యులు. దేవతాస్తోత్రం కేశాది పాదాంతంగా చే యడం సంప్రదాయం. ఆ సంప్రదాయానికి ఉదాహరణ మనకు శ్రీలలితా సహస్రనామ స్తోత్రంలో గోచరిస్తున్నది. ఈ సంకీర్తనలో అన్నమయ్య సుప్రతిష్టితం చేసింది ఆ సంప్రదా యాన్నే ఈ కీర్తన మంగళహారతి ఇచ్చే దృశ్యం మనకు కట్టెదుట నిలిపే పదచిత్రం.

శ్రీమహాలక్ష్మికి, క్షీరసాగర కన్యకు, నీరజాలయకు ఈ నీరాజనం. అచింత్య లక్షణాకా రమైన ఆ జలజాయతలోచన ముఖపద్మానికి, చక్రవాకయుగళసదృశమైన ఆమె వక్షోజ ద్వయానికి తుమ్మెదలదండవంటి ఆ కొప్పు ఒనపరితనానికి, వరదాభయ  ప్రదాలైన ఆ క మలాకరకమలాజితకమలాలకు, కమలాపతిప్రియమణులు, కెంపుల నిలువెత్తు నీరాజనం ('సమర్పయామి' అని అన్వయించుకోవలె)

ఆమె చరణపల్లవాల లేకెంజాలకు ఆమెరంభాసదృశోరువులకు నిత్యమైన ముత్యాల నీరాజనం, అరుదైన ఆమె కటరమ్యతకు, నతగంభీరనాభికి వివిధవర్ణాల నీరాజనం.

శ్రీవేంకటేశ్వరునికి పట్టపురాణియై అలరారే సిరికళలకు ఇది నీరాజనం. అలమేల్మంగ చక్కని అందాలన్నింటికీ అనంత జగదంత దిగంత శృంగార నిజ శోభన నీ రాజనం.

ఈ సంకీర్తనాన్ని స్వరపరచి, మెఱుగులు దిద్దినవారు పూజ్యపాదులు, శ్రీమాన్ రాళ్ల పల్లి అనంతకృష్ణశర్మగారు. బహుళ ప్రచారంలోకి వచ్చిన అన్నమాచార్యుల సంకీర్తనలలో ఆణిముత్యంవంటి ఈ సంకీర్తన ప్రతి యింటా హారతి యిచ్చేవేళ పాడితే

అనిర్వచనీయానందైశ్వర్యాలు లభించటంలో సందేహం లేదు.